క్లుప్తంగా

నేటి నుంచి రామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవాలు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పట్టాభిషేక మహోత్సవాలు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు, బృందావనం గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, 24న 108 కలశాలతో జ్యేష్టాభిషేక మహోత్సవం, 25న ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12.45గంటలకు సీతారామచంద్రస్వామికి పట్టాభిషేక మహోత్సవం, అనంతరం పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బాపట్ల అర్బన్: పిన్నిబోయినవారిపాలేనికి చెందిన బోలిగర్ల వెంకట రమణయ్య ఈ నెల 16న గుండె పోటుతో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చులు రూ.10వేలను మృతుని కుటుంబ సభ్యులకు జెడ్పీటీసీ సభ్యురాలు పిన్ని బోయిన ఎస్తేరు రాణి సోమవారం అందజేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ పిన్ని బోయిన ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, మహిళా పోలీస్ నాగలక్ష్మి, వలంటీర్, ఆశ వర్కర్ ఉన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'


అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీపీ రాపర్ల నరేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని తెలిపారు.

వీర్లంకమ్మకు విశేష పూజలు



కర్లపాలెం: పెద పులుగువారిపాలెంలో నూతనంగా ప్రతిష్టించిన చిన అక్కలవారి ఇలవేల్పు వీర్లంకమ్మ అమ్మవారికి సోమవారం విశేష పూజలు జరిగాయి. ఆలయంలో వీర్లంకమ్మ, పోతురాజు స్వామి విగ్రహాలు ప్రతిష్టించి 16 రోజులైన సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. చిన అక్కలవారి వంశస్థులతో పాటు గ్రామంలోని భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొని, పొంగళ్లు పొంగించి, నైవేద్యాలు సమర్పించారు.

'సొసైటీ'లో అవకతవకలపై విచారణ ప్రారంభం



బాపట్ల: బాపట్ల పట్టణంలోని దగ్గుమల్లివారిపాలెం ఆది ఆంధ్ర కో–ఆపరేటివ్ కలెక్టింగ్ ఫార్మింగ్ సొసైటీలో అవకతవకలపై విచారణ ప్రారంభమైంది. తహసీల్దార్ సుధారాణి సోమవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు దగ్గుమల్లి ధర్మారావుతోపాటు మిగిలిన సభ్యులు విచారణలో పాల్గొన్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలను తహసీల్దార్‌కు వివరించారు. కమిటీ సభ్యులు అడే రవికుమార్, యాతం మోజేస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

25న 'ఆణిముత్యాలు' అవార్డు ప్రదానంపై సమీక్ష

వేమూరు: ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్నట్లు ఎంఈఓ కాజ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాల విద్యా శాఖాధికారులు, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న వేమూరు నియోజకవర్గ కేంద్రంలో 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డుల ప్రదానంపై సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి చీకటి రవి కాంత్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషిచేయాలి

- ఆక్వా పార్కుతో 500 మందికి ఉపాధి
- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషిచేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. నిజాంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగ పరుచుకునేలా అధికారులు కృషిచేయాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకు అనుగుణంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని స్పష్టం చేశారు. తీర ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో 280 ఎకరాల విస్తీర్ణంలో రూ.180 కోట్ల వ్యయంతో దిండి పంచాయతీ పరిశావారిపాలెంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుకు సీఎం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఆక్వా పార్కు ఏర్పాటుతో తీర ప్రాంతం అభివృద్ధి చెందమే కాకుండా సుమారు 500ల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ అక్వా పార్కులో సీ బాస్(పండుచేప)సీడు ఉత్పత్తి, పీతల సీడు, రొయ్యల సీడు ఉత్పత్తితో పాటు ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో పలు ప్రభుత్వ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఎంపీ మోపిదేవి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, ఎంపీడీవో నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు చంటి, నాజర్ ఖాన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ విప్లవాత్మక మార్పునకు నాంది

వలంటీర్ల సత్కారంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: సచివాలయాల వ్యవస్థతో విప్లవాత్మకమైన మార్పునకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గంలోని నరసాయపాలెం, కంకటపాలెం, చెరువు జమ్ములపాలెం, మూలపాలెం వలంటీర్ల సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ప్రతి గడపకు చేరాలంటే పాలన క్షేత్రస్థాయిలో ఉండాలనే ఉద్దేశంతో సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లోని అన్ని విభాగాల నుంచి ఉద్యోగులు సచివాలయంలో అందుబాటులో ఉండటంతో పాలన పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. ఇందులో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలను కోన రఘుపతి కొనియాడారు. అలాంటి వారిని గౌరవించుకోవటం అందరూ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీడీఓ రాధాకృష్ణ, నాయకులు వడ్డిముక్కల డేవిడ్, గవిని కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

'స్పందన'తో సమస్యలకు పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ పార్థసారథి

రేపల్లె: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని, అర్జీలు స్వీకరించారు. కుల ధృవీకరణ పత్రానికి 2, రోడ్డు సర్వే చూపించాల్సిందిగా 2, ఫిషరీస్ సొసైటీ ఎన్నికల నిర్వహణకు 1, అండగల్ పేర్లు తొలగించాలని 1, ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని 1, ఎంకరేట్‌మెంట్ ఇఫ్ ఇరిగేషన్ కెనాల్ సర్వే చేయించాలని కోరుతూ 1 చొప్పున అర్జీలు అందాయని తెలిపారు. అర్జీలను పరిశీలించి పరిష్కరించటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి సామగ్రి అందజేస్తున్న సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన అమర్తలూరి సౌదామణి పూరిల్లు ఈ నెల 7న ప్రమాదవ శాత్తూ అగ్నికి ఆహుతి కాగా, ఆ మంటల్లో చిక్కుకుని ఆమె కుమారుడు రవికుమార్ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సహృదయ ఫౌండేషన్ (యుఎస్ఏ) బాధిత కుటుంబానికి చేయూతనందించింది. ఫౌండేషన్ తరపున సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, మండల కార్యదర్శి జి.సుధాకర్ సోమవారం ఇంటి సామగ్రి, నిత్యావసర సరుకులు అందించారు. మృతుడు రవికుమార్ కుటుంబానికి రూ.10 లక్షలు సీఎం సహాయ నిధి ద్వారా అందించేలా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పప్పల మనోజ్ కుమార్, కార్యదర్శి కిరణ్‌కుమార్, సీపీఎం నాయకులు గోళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత సాంబశివరావు మృతి



తెనాలిటౌన్: సీపీఎం సీనియర్ నాయకుడు వల్లభనేని సాంబశివరావు (72) అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు కె.బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ సంతాపం వ్యక్తం చేశారు. సాంబ శివరావు సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు వారు తెలిపారు. దుగ్గిరాల మండలం తుమ్మడి గ్రామానికి చెందిన సాంబశివరావు 1969లో పార్టీ రాష్ట్ర రాజకీయ పాఠశాల చిలువూరులో జరిగిన సందర్భంలో వలంటీర్‌గా పనిచేశారని తెలిపారు. 1971లో యువజన సంఘం గ్రామ కార్యదర్శిగా, 1973 నుంచి తాలూకా యువజన సంఘం కార్యదర్శి నుంచి వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా తెనాలి సీపీఎం కార్యదర్శిగా ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. మంగళవారం ఆయన స్వగ్రామం తుమ్మపూడిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆయన మృతి పట్ల జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, షేక్ అహ్మద్ హుస్సేన్, పోస్టల్ నాయకులు పి.జోనేష్, మహిళా సంఘం కార్యదర్శి ఎస్.రాజ్యలక్ష్మి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి ఉత్సవాలు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేశారు. వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి నేతృత్వంలో వైదిక క్రతువును పండితులు, అర్చకులు కిరణ్, సురేష్‌లు జరిపారు. తెలుగు పండితులు ములుకుట్ల విశ్వనాథశర్మ ప్రవచనం చేయగా, సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, కార్యనిర్వాహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవా సమితి అధ్యక్షులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, జంధ్యా రామారావు తదితరులు పాల్గొన్నారు.

హాస్య నట చక్రవర్తి కాళిదాసు కోటేశ్వరరావు

నేడు 29వ వర్ధంతి సేవా కార్యక్రమాలు



కాళిదాసు కోటేశ్వరరావు



సుబ్బిశెట్టి పాత్రలో...

తెనాలి:నిరుపేద కుటుంబంలో జన్మించి, నటనను వృత్తిగా చేసుకుని హాస్య నట చక్రవర్తిగా కీర్తి పొందిన నటుడు కాళిదాసు కోటేశ్వరరావు. 29వ వర్ధంతి రోజైన మంగళవారం స్థానిక బోసు రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆ మహా నటుడి జీవిత విశేషాలు.

ప్రముఖ నాటకాల్లో హాస్య పాత్రను ప్రధాన పాత్రలకు దీటుగా చతుర సంభాషణలతో, హద్దులు మీరని హాస్యాభినయంతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తిన కాళిదాసు కోటేశ్వరరావు స్వస్థలం తెనాలి. 1925లో జన్మించారు. తొలుత ఎమ్యూజ్‌మెంట్ పార్కులో హాస్య పాత్రధారిగా చేశారు. మిత్రుల ప్రోత్సాహంతో నాటక రంగ ప్రవేశం చేసి, స్వయం కృషితో ఎదిగారు. కాళిదాసు నాటకంలో కాళుడు, బాలనాగమ్మలో తిప్పడు, చింతామణిలో సుబ్బిశెట్టి, వర విక్రయంలో సింగరాజు/లింగరాజు, సక్కుబాయిలో కాశీపతి, తులాభారంలో వసంతకుడు పాత్రల్లో జీవించారు. కాళ్లకూరి నారాయణరావు నాటకం చింతామణికి సుబ్బిశెట్టి పాత్రధారిగా కోటేశ్వరరావు నటన గొప్ప ఆకర్షణ. 'సంభాషణల్లో సభ్యతకు లోటుండేది కాదు. చౌకబారు చేష్టలలకు తావుండేది కాదు' అనిపించుకున్నారు. బాలనాగమ్మ నాటకంలో వల్లూరు వెంకట్రామయ్య మాయల మరాఠీ పాత్రలో రంగస్థలంపై బీభత్స, భయానక రసాలతో నటిస్తుంటే తిప్పడు వేషంలో కాళిదాసు ధీటైన హాస్యాన్ని పండించారు. 1967లో గోపాలకృష్ణ నాట్య మండలి పేరుతో నాటక సమాజాన్ని స్థాపించారు. బృందావనం అనే నాటకాన్ని ఆడారు. తెనాలిలో నాటి విద్యాశాఖ మంత్రి భవనం వెంకట్రావు అధ్యక్షత వహించిన ఓ సత్కార సభలో కోటేశ్వరరావుకు కనకాభిషేకం చేశారు. నన్నపనేని వెంకట్రావు, మోదుకూరి జాన్సన్, వల్లూరు వెంకట్రామయ్య, కన్నెగంటి నాసరయ్య, బొల్లిముంత శివరామకృష్ణ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం తొలి అధ్యక్షుడిగా కోటేశ్వరరావు పనిచేశారు. అప్పట్లో సినీ రజతోత్సవాల్లో భాగంగా తెనాలి వచ్చిన ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావును కళాకారుల సంఘం తరపున కోటేశ్వరరావు సత్కరించారు. ఆ మహా నటుడు కన్నుమూశాక, కాళిదాసు అభిమానులు బోసురోడ్డులో ఆయన విగ్రహాన్ని నెలకొల్పి నివాళులర్పిస్తున్నారు.

గోవిందనామ సంకీర్తన యజ్ఞంకు ఆహ్వానం



సంకీర్తన యజ్ఞం నిర్వాహకులు

తెనాలి: శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం, శ్రీ సాయిరాం సంగీత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 6–12 సంవత్సరాల చిన్నారులతో గోవిందనామ సంకీర్తన యజ్ఞం చేపడుతున్నట్టు నిర్వాహకులు సోమవారం విలేకరులకు వెల్లడించారు. లక్కరాజు కనకదుర్గ పర్యవేక్షణలో 108 మంది చిన్నారులతో గోవిందనామ సంకీర్తన చేయ దలచినట్టు తెలిపారు. సంప్రదాయ దుస్తులతో తిరునామం ధరింపజేసిన పిల్లలను రెండు నిముషాలకు మించకుండా గోవిందనామ సంకీర్తనలు చేయించిన వీడియోలను 92464 40685 నంబరుకు వాట్సాప్ చేయాలని కోరారు. జూన్ 3వ లోగా పంపిన వీడియోలను పరిశీలించి, ఉత్తమ సంకీర్తన చేసిన పిల్లలకు నగదు, జ్ఞాపికలను అందజేస్తామని తెలిపారు. పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు ఉంటాయని తెలిపారు. చిన్న పిల్లల్లో భక్తిభావం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. నిర్వాహకులు కొండపి వసుంధర, శ్రీనివాసరావు, వఝుల లక్ష్మీసునీత, లక్కరాజు కనకదుర్గ పాల్గొన్నారు.

ఘనంగా జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



నగరం: శ్రీనివాస నామస్మరణతో జిల్లేపల్లి గ్రామం మార్మోగింది. గ్రామంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. దిట్టకవి వెంకటలక్ష్మణాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రయుక్తంగా ధ్వజస్తంభ, వినాయక, అభయాంజనేయ స్వామి, గరుడ ఆళ్వార్ ద్వార పాలకుల ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విశేష పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కోలాట భజన సంకీర్తన భక్తులను విశేషంగా అకట్టుకుంది. కార్యక్రమంలో అర్చకులు సౌభాగ్యరావు, జంజనం హేమశంకరావు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

తగలబెట్టొద్దు.. కుళ్లబెట్టండి



పొలంలో వరి గడ్డికి పెట్టిన నిప్పు

పిట్టలవానిపాలెం: వరి పంటను యంత్రాలతో కోసిన అనంతరం కొందరు రైతులు గడ్డిని పొలాల్లోనే తగులబెడుతున్నారు. దీంతో పోషకాలను భూమి కోల్పోతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పిట్టలవానిపాలెం మండలంలో 12,500 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇందులో సుమారు 70 శాతం పంట కోత యంత్రాలతోనే పూర్తి చేశారు. యంత్రాలతో పంట కోత కారణంగా.. గడ్డి పూర్తిగా నలిగి బయటకు రావడంతో వృథాగా మిగిలిపోతుంది. రైతులు ఎండు గడ్డికి నిప్పంటించి కాల్చేస్తున్నారు. దీంతో ఎండు గడ్డి ఎందుకూ పనికిరాకుండా బూడిదగా మారిపోతోంది. అలా కాకుండా వరి గడ్డిని పొలంలోనే కుళ్లి పోయేలా చేస్తే నేల సారవంతమవుతుంది. యంత్రాలతో కోసిన పొలాల్లో గడ్డిని మురుగు దమ్ము చేసి నేలలో కలిసిపోయేలా దున్నుకోవాలి. నేలలో గడ్డి త్వరగా కుళ్లేందుకు డీ కంపోజర్, రసాయనాలు ఉంటాయి. వీటిని ఎకరాకు ఒక కిలో చొప్పున వేస్తే గడ్డి 25 నుంచి 30 రోజుల్లో కుళ్లి పోతుంది. సేంద్రియ ఉత్పత్తుల కేంద్రం నుంచి వరి గడ్డిని కుళ్ల బెట్టే ద్రావకాలు రైతులు వాడుకోవడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు దాళ్వా సీజన్ అనంతరం వరి చేలో పశుగ్రాసానికి ఉపయోగపడే జనుము, పిల్లిపెసర, జొన్న వంటి రకాలను చల్లుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

గడ్డిని తగలబెట్టవద్దు



పొలాల్లో గడ్డిని తగలబెట్టకూడదు. గడ్డిని పోగుచేసి ఉప్పు చల్లి.. మేటు వేసి మాగబెడితే పశువులు ఇష్టంగా తింటాయి. పోషక విలువలు పెరుగుతాయి. గడ్డిపై సూపర్ పాస్ఫేట్‌ను భూమిలో కలియదున్నాలి. దీని వల్ల భూమికి కొన్ని రకాల పోషకాలు అందుతాయి.

– లక్ష్మి, ఏడీఏ, బాపట్ల

24న మద్యం నిషేధానికి.. సైకిల్ యాత్ర

తెనాలిటౌన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి తెనాలి శాఖ ఆధ్వర్యంలో మద్య నిషేధం కోరుతూ ఈ నెల 24న సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ సోమవారం తెలిపారు. గంగానమ్మపేటలోని చుండూరు వారి సత్రం నుంచి బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళ పీజీ కాలేజ్ వరకు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 5.30గంటలకు చుండూరు వారి సత్రం వద్ద యాత్ర బయలుదేరుతుందని, విద్యార్థులు, యోగసాధకులు పాల్గొనాలని కోరారు. అదే రోజు ఉదయం 7 గంటలకు పీజీ కాలేజ్ ఆడిటోరియంలో మద్యపానం–సమాజంపై దుష్ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో మానసిక వైద్యులు అయినంపూడి శరత్‌బాబు, రావూరి సుబ్బారావు, డాక్టర్ జేఎస్‌వీ సురేష్‌బాబు, ఎం.దశరథరామిరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ర్యాలీలో విద్యార్థులు, యోగసాధకులు పాల్గొని జయప్రదం చేయాలని యోగ మండలి గురుబోధకులు తాడికొండ శ్రీనివాసరావు కోరారు.

వివాహితకు అసభ్యకర ఫోన్‌కాల్స్

తెనాలిరూరల్: వివాహితకు ఫోన్ చేసి అసభ్యకరంగా వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం అంగలకుదురుకు చెందిన ప్రతాప్ తనకు తెలిసిన అదే గ్రామానికి చెందిన సురేష్ వద్ద కొంత మొత్తం గతంలో అప్పుగా తీసుకున్నాడు. అప్పు చెల్లించడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రతాప్‌కు లాయర్ నోటీసు పంపాడు. అప్పటి నుంచి సురేష్ ఫోన్ చేస్తే ప్రతాప్ సమాధానం ఇవ్వడం లేదు. దీంతో తనకు సురేష్ ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ప్రతాప్ భార్య పోలీసులను ఆశ్రయించారు.

ఈ మేరకు..రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్‌లో నిర్మానుష్యంగా రహదారి



పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రాజ్యలక్ష్మి థియేటర్ సెంటర్ ఇలా..

రేపల్లె..వెలవెల

రేపల్లె రూరల్: ప్రచండ భానుడి ప్రతాపంతో రేపల్లె వెలవెలబోతోంది. 15 రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు అధికమవడంతో నియోజకవర్గ ప్రజలు ఉడికిపోతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండ వేడిమి అధికంగా ఉండటంతో హడలిపోతున్నారు. నిత్యం జన సంచారంతో రద్దీగా ఉండే పట్టణంలోని పలు రహదారులు బోసిపోతున్నాయి. అత్యవసర పనులపై వచ్చేవారే తప్ప.. మిగిలిన వారు గృహాలకు పరిమితమవుతున్నారు. శీతల పానీయాలతో ఎండవేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు.



నిర్మానుష్యంగా బస్టాండ్ సెంటర్